మండలానికో ధాన్యం కొనుగోలు కేంద్రం

● కలెక్టర్ విజయేందిరబోయి

ఆకుకూరల విత్తనాలు అందిస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 14 : మండలానికి ఒకటి చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ విజయేందిరబోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ధాన్యం రాకను కొనుగోలు కేంద్రాల అవసరాలను గుర్తించి నిర్వేశించిన కేంద్రాలన్నింటి నీ ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం ప్రజావాణి వినతులు, ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్, పంచాయతీల వారీగా నిర్దేశించిన నిబంధనలకు లోబడి కమిటీ సభ్యులు ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు, కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల్లో కూరగాయల మొక్కలు పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు గానూ జిల్లాలో 1412 విద్యాలయాలు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా విద్యాలయాల్లో ఆకుకూరలు, కాయకూరలు విత్తనాల కిట్‌లను ఉద్యానశాఖ ద్వారా కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు అందజేశారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ మోహన్ రావు, డీఆర్వో కేవీవీ.రవికుమార్, జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు సమయానికి రావాలి

జడ్చర్ల : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

● మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల, అక్టోబర్ 14 : ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల అధికారులు, గ్రామ కార్యదర్శులందరు సమయానికి హాజరుకావాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. సోమవారం జడ్చర్లలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిశాఖకు చెందిన అధికారులు, గ్రామ కార్యదర్శులు ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని, ప్రజావాణికి రానివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణిపై ఆయా గ్రామాల్లోని ప్రజలకు గ్రామ కార్యదర్శులు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా మంచినీటి సమస్య లేకుండా చూడాలని, ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారి దరఖాస్తులను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి వాటిని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ బ్రహ్మం గౌడ్, ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవో మంజులాదేవి, మున్సిపల్ కమిషనర్ రాజయ్య, ఏవో గోపినాథ్, ఏపీఎం మాల్యానాయక్ ఉన్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

● నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, అక్టోబర్ 14: ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యల కోసం ప్రజావాణిలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయా శాఖలకు చెందిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు పంపించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 30ఆర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ట్రైనీకలెక్టర్ గరిమనురుల, అధికారులు ఉన్నారు.

దర్యాప్తు వివరాలను వివరించాలి

సమస్య తెలుసుకుంటున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, అక్టోబర్ 14: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ లింగయ్య పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఐదు గురు బాధితులు తమ ఆర్జీలను అందజేశారు. ఆర్జీలను నేరుగా స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదులు చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఫోన్‌లో సంబంధిత సీఐ, ఎస్సైలను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితుల సమస్యలు ముందుగా తెలుసుకొని పరిష్కరిస్తే చాలావరకు నేరాలను అరికట్టే అస్కారం ఉంటుందన్నా రు. బాధితుల ఫిర్యాదు మేరకు చేపడుతున్న దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు బాధితుడికి తెలియజేయాలన్నారు.

శిక్షల శాతం పెంచాలి

నారాయణపేట, అక్టోబర్ 14: ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టి శిక్షల శాతం పెంచేందుకు కృషి చేయాలని డీఎస్పీ లింగయ్య ఆదేశించారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మక్తల్, కోస్గి సర్కిల్ పోలీసులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్‌వోపీ ప్రకారం కేసులను విచారణ చేపట్టి వాటిని ఛేదించాలన్నారు. గంజాయి, మట్కా, పేకాటపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి వాటిని సమూలంగా నిర్మూలించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసులలో త్వరితగతిన విచారణ చేపట్టి 60రోజుల్లో చార్జీషీటు దాఖలు చేయాలన్నారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ వినియోగించాలని, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో సీఐ దర్గానాయక్, ఎస్సైలు రాంలాల్, బాలరాజు, భాగ్యలక్ష్మీరెడ్డి, నవీద్, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన కోస్గి ఎస్సై

సోమవారం కోస్గి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బాలరాజు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ లింగయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పంటలు కాపాడాలి

దేవరకద్ర, అక్టోబర్ 14 : మండలంలోని బస్వాపూర్ గ్రామ సమీపంలో ఉన్న క్రషర్ మిషన్ సమీపంలో పంట పొలాలు ఉన్న రైతుల పంటలను కాపాడాలని రైతులు నాగన్న, బుచ్చన్న సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో క్రషన్ మిషన్ ఏర్పాటు చేయడంతో గుట్టలో బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు వచ్చి పొలాల్లో పడడంతో తమ పంటలు దెబ్బ తిని నష్టపోతున్నట్లు వారు తెలిపారు. క్రషన్ నుంచి తమ పంట పొలాలను కాపాడాలని రైతులు ప్రజావాణిలో కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

నవాబ్‌పేట, అక్టోబర్ 14 : ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జయరామ్‌నాయక్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణిలో రెండు రెవెన్యూ, ఒకటి పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో భద్రునాయక్, ఏపీవో జ్యోతి, ఏపీఎం జీవరత్నం, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారిగా శంకరాచారి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 14: జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి(ఎఫ్ఏసీ)గా జి.శంకరాచారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా కోఆపరేటివ్ అధికారిగా కొనసాగుతున్నారు. గతంలో పనిచేసిన రవీంద్రనాథ్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో బీసీ సంక్షేమశాఖ అధికారిణి ఇందిరకు కొంతకాలం ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే గతంలో డీఎండబ్ల్యూవోగా పనిచేసిన జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా కోఆపరేటివ్ అధికారిగా శంకరాచారి రావడంతో తిరిగి ఆయనకే పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

అధికారుల సూచనలు పాటించాలి

మహ్మదాబాద్, అక్టోబర్ 14 : మండలంలోని నంచర్ల, దేశాయిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి నరేందర్ వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు సలహాలు అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంకి నల్లి పంటను ఆశించి వరి పంటను నష్టం పరుస్తుందని సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కంకి నల్లి ఆశించిన గింజలపై నల్లటి మచ్చలు ఏర్పడి పాలు పోసుకోక తాలు గింజలు అవుతాయని ఈ లక్షణాలను గుర్తించిన వెంటనే 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా డైకోఫాల్ 5 మి.లీ లేదా స్పైరోమేషిన్ 1 మి.లీ లీటరు నీటిలో కలిపి వ్యవసాయాధికారుల సూచనలు పాటించి మందులను పిచికారీ చేయాలన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

దేవరకద్ర, అక్టోబర్ 14 : ప్రతిఒక్కరూ సైబర్ క్రైమ్‌తో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై నాగన్న ప్రజలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సామాజిక ఘటన, సైబర్ క్రైమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆపరిచిత వ్యక్తులతో జాగ్రతగా ఉండాలని సూచించారు.

కిక్కిరిసిన బస్టాండ్లు

బస్సులో ఎక్కుతున్న ప్రయాణికులు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 14 : దసరా పండుగ ముగియడంతో విద్యార్థులు, ఉద్యోగస్తులు, ప్రజలు పట్టణాలకు వెళ్లేందుకు తిరుగపయనమయ్యారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ రీజినల్ పరిధిలోని బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. బస్సులు ప్లాట్‌ఫాంపైకి రాకముందే ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. దసరా సందర్భంగా ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు రీజినల్ పరిధిలో 4.48 లక్షల మంది ప్రయాణించగా.. 104 శాతం ఆక్యుపెన్సీ సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్‌కు ప్రత్యేకంగా 210 బస్సులను నడిపామన్నారు. ఇదిలా ఉండగా, మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో వారం రోజులుగా దొంగతనాలు జరిగినట్టుల పలువురు ఆరోపిస్తున్నారు. ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి మరో ముగ్గురు మహిళలు బంగారం చోరీ చేయడంతో సోమవారం పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

నిబంధనల ప్రకారం పరిష్కరించాలి

● నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, అక్టోబర్ 14: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాలవారీగా ఎక్కువ పెండింగ్ ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. రెగ్యులరైజేషన్ యాప్ ద్వారా పరిష్కరించే అంశంపై చర్చించారు. ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకొని దరఖాస్తులకు పరిష్కారం చూపాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే నిలిపివేయాలన్నారు. సమావేశంలో డీపీవో కృష్ణ, ఎంపీడీవో పావని, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బ్యాంకర్లు నిర్లక్ష్యం వీడాలి..

● ఎంపీ డాక్టర్ మల్లురవి

మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ మల్లురవి

వనపర్తి, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ) : పేదల అభ్యున్నతి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష యోజన, అటల్ బీమా యోజన వంటి ముఖ్యమైన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించకుండా బ్యాంకర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వనపర్తి జిల్లా దిశ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మల్లురవి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం నిర్వహించగా వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే అనేక బీమా పథకాలను ప్రజలకు అందించడంలో బ్యాంకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఒక్కొక్క బ్యాంక్ ఒకటి, రెండు మాత్రమే చేయించారని, రెన్యువల్‌కు వచ్చే సరికి అది కూడా లేదని మరీ ఇంత నిర్లక్ష్యం పనికిరాదన్నారు. ముద్ర రుణాలు, టర్మ్‌లోన్, ప్రయారిటీ సెక్టార్, నాన్ ప్రయారిటీ సెక్టార్ వారీగా ఇవ్వాల్సిన రుణాలు సైతం నిర్దేశించిన లక్ష్యాలు సాధించలేదని బ్యాంకర్ల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట రుణాలు సహితం బ్యాంకర్లు లక్ష్యం మేరకు రైతులకు ఇవ్వడం లేదని బ్యాంకర్ల పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వచ్చే దిశా సమావేశం నాటికి ప్రజలకు అవగాహన కల్పించి లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా యువతకు, మహిళలకు స్వయం ఉపాధికి 80శాతం సబ్సిడీతో 2021-22లో మంజూరైన రుణాలు ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాకపోవడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 80శాతం డబ్బులు ప్రభుత్వం ద్వారా మంజూరై బ్యాంకుల్లో మూలుగుతున్నా... బ్యాంకులు ఇవ్వాల్సిన 20శాతం ఇవ్వకుండా తాత్సారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశానికి రాని బ్యాంక్ మేనేజర్లు కలెక్టర్‌కు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేసినప్పుడే సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయన్నారు. అనంతరం విద్య, విద్యుత్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో రాష్ట్ర మైనార్టీ బోర్డు చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఎల్‌డీఎం కౌశల్ కిశోర్ పాండే, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

జడ్చర్ల, అక్టోబర్ 14 : జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో ఖాలీగా ఉన్న పోస్టుకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య సోమవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 50శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్ఈటీ, ఎన్ఈటీ, పీహెచ్‌డీ అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5గంటలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 18వ తేదీన ఉదయం 11గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

మొక్కజొన్న రూ.2,456

నవాబ్‌పేట, అక్టోబర్ 14 : నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మొక్క జొన్నకు క్వింటాకు గరిష్టంగా రూ.2,456, కనిష్టంగా క్వింటాకు రూ.1,690 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఒక్కరోజే మార్కెట్‌కు 1,633 బస్తాల మొక్కజొన్న ధాన్యం మార్కెట్‌కు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్

నారాయణపేట టౌన్, అక్టోబర్ 14: జిల్లాలోని గ్రంథాలయాలల్లో ఆధునిక పుస్తకాలు, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లాలోని మద్దూర్, దామరగిద్ద, పట్టణంలోని గ్రంథాయాలను సందర్శించారు. గ్రంథాలయాలల్లో నెలకొన్న సమస్యలను లైబ్రరీయన్‌లను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించారు. నిధుల లేమీతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని కాంట్రాక్టర్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, అధికారులతో మాట్లాడి పనులు మొదలయ్యేలా చూస్తానని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందేకు కృషి చేస్తానన్నారు. డిసెంబర్ నాటికి గ్రంథాలయం పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, మున్సిపల్ కమిషనర్ సునీత, గ్రంథాలయ జిల్లా కార్యదర్శి సురేశ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రకాంత్, పట్టణ అధ్యక్షుడు సలీం, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ-2024 ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

మాట్లాడుతున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, అక్టోబర్ 14: డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఈనెల 15వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. సోమవారం విద్యాశిక్షణ సంస్థలో డైట్ ప్రిన్సిపల్ ఛాంబర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థులందరూ మంగళవారం ఉదయం 9గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని ఐడీవోసీ సమావేశ మందిరంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమతో పాటు ఆర్డర్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, హాల్ టికెట్లు తీసుకురావాలని కోరారు. కౌన్సెలింగ్ హాల్‌లోకి అభ్యర్థులకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

● అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి

ఊట్కూర్, అక్టోబర్ 14 : పత్తి కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేసి రైతులు పండించిన పత్తిని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బిజ్వారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతాంగం అతివృష్టి, అనావృష్టికి గురై విలవిలలాడుతున్న ప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జిల్లాలో 1,65,150 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేయగా తేమ శాతం పేరుతో దళారులు రైతులను దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పత్తి రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సలీం, కిరణ్, అంజప్ప, గోవిందు, చిన్నబాలు ఉన్నారు.

బీసీల పోరాట ఫలితమే కులగణన జీవో విడుదల

మాట్లాడుతున్న బీసీ సమాజ్ నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 14 : బీసీల పోరాట ఫలితంగానే ప్రభుత్వం బీసీ కులగణన జీవో విడుదల చేసిందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో వివిధ బీసీ కుల సంఘాలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కుల గణనలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా కామరెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగానే సమగ్ర కుల గణన, 42 శాతం రిజర్వేషన్లు ఒకేసారి చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, పద్మశాలి, జాంద్రా సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంత్, మహేందర్, ఆశన్న, వేణుగౌడ్, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

యువకుడి ఔదార్యం

మరికల్, అక్టోబర్ 14: పాలమూరు ఐసీఐసీఐ బ్యాంక్‌లో పనిచేసే క్యాషియర్ హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తుండగా జడ్చర్ల బస్‌స్టాండ్‌లో వాటర్ బాటిల్ కోసం దిగాడు. బస్ కండక్టర్ గమనించకుండా బస్సు నారాయణపేటకు బయలేదేరింది. వేరే బస్సులో మహబూబ్‌నగర్ వరకు వచ్చినా అక్కడ కూడా బస్సు కనిపించకపోవడంతో బస్‌స్టాండ్‌లో దిగాలుగా ఉన్న క్యాషియర్‌ను చూసి తీలేరుకు చెందిన బాలకృష్ణాచారికి తెలిసిన వారు ఫోన్ చేసి జరిగిన ఘటన వివరించారు. దీంతో ఆదివారం అర్ధరాత్రి బస్సును మరికల్‌లో నిలిపి క్యాష్‌బ్యాగ్‌ను తీసుకొని క్యాషియర్‌కు అందజేశారు. బ్యాగ్‌లో ల్యాప్‌టాప్‌తోపాటు నగదు కూడా ఉండడంతో క్యాషియర్‌కు బ్యాగ్‌ను అందజేయడంతో క్యాషియర్ కృతజ్ఞతలు తెలిపారు. విషయం తెలిసిన గ్రామస్తులు కూడా బాలకృష్ణను అభినందించారు.

దొంగల చేతివాటం

● పాలమూరు బస్టాండ్‌లో 32 తులాల బంగారం చోరీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 14 : మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ప్రయాణికులు బస్సులో సీటు సంపాదించడానికి ఆరాటపడుతుంటే.. దొంగలు వారి చేతి నైపుణ్యానికి పనిచెప్పారు. పలువురి పర్సులు, గొలుసులు, ఇతర వస్తువుల ఎత్తుకెళ్లారు. చాకచక్యంగా 32 తులాల బంగారాన్ని తస్కరించారు. హైదరాబాద్ నుంచి కొడంగల్ మండలం హస్నాబాద్‌కు వెళ్తున్న శిరీష పరిగి బస్సు ఎక్కే క్రమంలో 15 తులాల బంగారం ఉన్న బ్యాగ్ చోరీకి గురైంది. అలాగే చిత్తనూరు (మరికల్) వెళ్లేందుకు బస్సెక్కిన సుధారాణి హ్యాండ్ బాగులో ఉన్న 9 తులాల బంగారం ఆభరణాలు, గండీడ్ మండలం కొమిరెడ్డిపల్లి నుంచి హైదరాబాద్ బస్ ఎక్కుతుండగా సువర్ణ బ్యాగులోని 8 తులాలు అపహరణకు గురైంది. వెంటనే గుర్తించిన ప్రయాణికులు సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యువకుడు అదృశ్యం

జడ్చర్ల, అక్టోబర్ 14 : జడ్చర్ల మండలంలోని కుర్వ గడ్డపల్లి గ్రామానికి చెందిన రామ్‌చరణ్ ఆదివారం అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు ఈనెల 13వ తేదీన రామ్‌చరణ్ మధ్యాహ్నం 2:30గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కుమారుడి కోసం గ్రామంలో, తెలిసినవారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతకినా ఆ చూకీ లభించకపోవడంతో సోమవారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువకుడి తల్లి కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి టీకాల పంపిణీ

జడ్చర్ల/మాగనూరు, అక్టోబర్ 14 : మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నుంచి పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జడ్చర్ల మండల పశువైద్యాధికారిణి ఆశారాణి తెలిపారు.

యువకుడి అదృశ్యం

మరికల్, అక్టోబర్ 14: పాలమూరు ఐసీఐసీఐ బ్యాంక్‌లో పనిచేసే క్యాషియర్ హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తుండ